

కల్యాణం.. కమనీయం

అల్లిపురం: విశాఖ బల్లిగిరిలోని శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక కల్యాణోత్సవం గురువారం కన్నుల పండుగగా జరిగింది.

ఉష్ణోగ్రతలు

శుక్రవారం

		గరిష్టం/కనిష్టం
అనకాపల్లి	:	35.4/24.5
చోడవరం	:	36.0/27.0



'రుగ్మత'కు విశిష్ట గుర్తింపు

విశాఖ: ఏయూ థియేటర్ ఆర్ట్స్ విద్యార్థులు రూపొందించిన 'రుగ్మత' హైదరాబాద్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఉత్తమ షార్ట్ ఫిల్మ్‌గా ఎంపికైంది.

న్యూస్‌రీల్

అదనపు జిల్లా జడ్జికి ఎస్పీ అభినందనలు



అదనపు జిల్లా జడ్జి నరేష్‌కు మొక్క అందజేస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: స్థానిక న్యాయస్థానాల సముదాయంలో గురువారం బాధ్యతలు స్వీకరించిన జిల్లా పదో అదనపు న్యాయమూర్తి వి.నరేష్‌ను ఎస్పీ తుహిన్ సిన్హా మర్యాదపూర్వకంగా కలిసి మొక్క అందజేశారు. అనకాపల్లిలో అదనపు జిల్లా జడ్జిగా విధులు నిర్వహించిన శ్రీవిద్య కర్నూలు ఏసీబీ జడ్జిగా బదిలీ అయిన విషయం తెలిసిందే. కొత్తగా బాధ్యతలు స్వీకరించిన న్యాయమూర్తి నరేష్‌కు ఎస్పీ అభినందనలు తెలిపారు.

ఇన్‌చార్జి కలెక్టర్‌గా జేసీ జాహ్నవి



తుమ్మపాల: కలెక్టర్ విజయ కృష్ణన్ గురువారం నుంచి ఆరు రోజులపాటు సెలవులో ఉన్నందున ఇన్‌చార్జి కలెక్టర్‌గా జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి బాధ్యతలు స్వీకరించారు. కలెక్టర్ కుటుంబసభ్యులతో కలిసి విదేశీ పర్యటనకు వెళ్లేందుకు సెలవు తీసుకున్నట్టు సమాచారం. జేసీని ఇన్‌చార్జి కలెక్టర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

అనకాపల్లి రైల్వే స్టేషన్లో విస్తృత తనిఖీలు



అనకాపల్లి రైల్వే స్టేషన్లో ప్రయాణికుల బ్యాగ్‌లను తనిఖీ చేస్తున్న పోలీస్ సిబ్బంది

అనకాపల్లి: జమ్మూ కశ్మీర్‌లోని పహల్గాం ప్రాంతంలో ఇటీవల జరిగిన ఉగ్ర దాడి, భారత్–పాకిస్థాన్‌ల మధ్య యుద్ధ వాతావరణం నేపథ్యంలో పట్టణంలో రైల్వే స్టేషన్, ఆర్టీసీ కాంప్లెక్స్, ప్రధాన జంక్షన్లు, జాతీయ రహదారులపై పోలీసులు తనిఖీలు నిర్వహించారు. ఎస్పీ ఆదేశాల మేరకు గురువారం రాత్రి సోదాలు నిర్వహించామని పట్టణ సీఐ టి.వి.విజయకుమార్ చెప్పారు. అనుమానిత వ్యక్తులు ఎక్కడైనా సంచరించినట్లయితే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు సమాచారం ఇవ్వాలని ఆయన కోరారు. పట్టణ ఎస్ఐలు సత్యనారాయణ, అల్లు వెంకటేశ్వరరావు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

'సేఫ్ స్టే' మొబైల్ యాప్ ఆవిష్కరణ

అనకాపల్లి: ప్రజల భద్రత కోసం జిల్లా పోలీసు శాఖ మరో ముందడుగు వేసిందని, ప్రజల రక్షణ కోసం 'సేఫ్ స్టే' పేరిట ప్రత్యేక మొబైల్ యాప్‌ను ప్రారంభించామని ఎస్పీ తుహిన్ సిన్హా చెప్పారు. తన కార్యాలయంలో గురువారం ఆన్‌లైన్‌లో యాప్ పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ యాప్ ద్వారా హోటళ్లు, లాడ్జీలు, ప్రైవేట్ గెస్ట్ హౌస్‌లలో తలదాచుకుంటున్న అతిథుల వివరాలను సురక్షితంగా నమోదు చేయవచ్చునని, వారికి నేర చరిత్ర ఉందా లేదా అనే విషయాన్ని పోలీసు డేటాబేస్‌తో సరిపోల్చి, అనుమానాస్పద వ్యక్తులపై ముందస్తు చర్యలు తీసుకునే వీలుంటుందన్నారు. నేరాల నియంత్రణ దిశగా యాప్ కీలక పాత్ర పోషిస్తుందన్నారు. సైబర్/సోషల్ మీడియా సెల్ సీఐ బెండి వెంకటరావు, ఎస్ఐ సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

చర్లపల్లి-బ్రహ్మాపూర్ స్పెషల్స్ పొడిగింపు

తాటిచెట్లపాలెం (విశాఖ): ప్రయాణికుల సౌకర్యార్థం చర్లపల్లి–బ్రహ్మాపూర్–చర్లపల్లి స్పెషల్ రైలు మరికొంత కాలం పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ సందీప్ తెలిపారు. చర్లపల్లి –బ్రహ్మాపూర్ (07027) స్పెషల్ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 9, 16, 23, 30 జూన్ 6, 13, 20, 27వ తేదీల్లో (శుక్రవారం) రాత్రి 8.15 గంటలకు చర్లపల్లిలో బయల్దేరి మరుసటిరోజు(శనివారం) ఉదయం 9.25 గంటలకు దువ్వాడకు, అదేరోజు మధ్యాహ్నం 2.15 గంటలకు బ్రహ్మాపూర్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో బ్రహ్మాపూర్–చర్లపల్లి (07028) స్పెషల్ ఈ నెల 10, 17, 24, 31, జూన్ 7, 14, 21, 28వ తేదీల్లో (శనివారం) సాయంత్రం 4.45 గంటలకు బయల్దేరి అదేరోజు రాత్రి 9.43 గంటలకు దువ్వాడకు, మరుసటిరోజు (ఆదివారం) ఉదయం 11.35 గంలకు చర్లపల్లి చేరుకుంటుంది.

సాయంత్రం అయిందంటే బయటి ప్రపంచంతో సంబంధం ఉండదు.. వర్షాకాలంలో గెడ్డలు దాటుకుంటూ వెళ్లాలి.. రహదారులు లేక సుస్తీ చేస్తే డోలీలనే ఆశ్రయించాలి.. ఇదీ ఒకప్పుడు ఆ నాలుగు గిరిజన గ్రామాల దుస్థితి. చాలా కాలం పాటు పాలకులెవ్వరూ వారి గురించి పట్టించుకోలేదు. కారణం వారి జనాభా కేవలం 250 కావడమే. ప్రజలను ఓటర్లుగా మాత్రమే చూసే వారి నైజమది. కానీ మహానేత, దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో 2006లో మెటల్ రోడ్డు వేశారు. మళ్లీ ఆయన తనయుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సీఎంగా ఉండగా రూ.5.65 కోట్ల నాబార్డు నిధులు మంజూరు చేసి మెటల్ రోడ్డును తారురోడ్డుగా అభివృద్ధి చేసే పనికి శ్రీకారం చుట్టారు. ఇప్పుడు ఆ రహదారులు అందుబాటులోకి రావడంతో నాలుగు గ్రామాల ప్రజలు పండగ చేసుకుంటున్నారు.

గిరిజన గ్రామాలకు పండగొచ్చింది..

మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికత ఫలితం

- అందుబాటులోకి వీరభద్రపేట-కొండెంపూడి-వీరభద్రపేట-గొప్పూరు తారురోడ్డు
- నాలుగు శివారు గిరి గ్రామాలకు తీరిన రహదారి కష్టం
- మాజీ డిప్యూటీ సీఎం బూడి చొరవతో రూ.5.65 కోట్ల నాబార్డు నిధులు
- రోడ్లు అందుబాటులోకి రావడంతో గిరి ప్రజల ఆనందం



వై ఆకారంలో వీబీపేట నుంచి కొండెంపూడి గొప్పూరు వెళ్లే రోడ్లు విభజన జరిగిన ప్రాంతం

చీడికాడ: మండలంలోని శివారు పంచాయతీ వీరభద్రపేట పరిధిలో కొండెంపూడి, గొప్పూరు, ముడిచర్ల, జైపురం గిరి గ్రామాలు ఉన్నాయి. ఇవి వీరభద్రపేట నుంచి ఐదారు కిలోమీటర్లు దూరంలో ఉన్నాయి. ఆ గ్రామస్తులు ఏ చిన్న వస్తువు కొనుక్కోవాలన్నా వీరభద్రపేట రావాలి. గ్రామస్తులు బయట ఊళ్లకు వెళితే కచ్చితంగా సాయంత్రంలోగా వెనుదిరగాలి. చీకటి పడితే సరైన రహదారి సౌకర్యం లేక రాత్రి వీరభద్రపేటలో గడిపి ఉదయాన్నే గ్రామాలకు వెళ్లాలి. ఇదీ వారి పరిస్థితి. రాత్రి సమయాల్లో విష పురుగులు కుట్టినా, ప్రమాదాలు సంభవించినా, గర్భిణులకు నొప్పులు ప్రారంభమైనా భగవంతునిపై భారం మోపి ఉదయం వరకు వేచి డోలీ మోతలతో తీసుకురావాల్సి ఉండేది. గతంలో కొందరు మృత్యువాత పడ్డారు. ఈ మొత్తం నాలుగు గ్రామాల్లో 250 మంది జనాభా ఉండడంతో గత ప్రభుత్వాలు ఓటుబ్యాంకు రాజకీయాలతో వీరిని పట్టించుకోలేదు. శివారు గ్రామాలకు మెరుగైన రహదారి ఉంటే విద్య, వైద్యం, మెరుగైన మౌలిక వసతులు అందించి ఆదుకోవచ్చన్న జగన్‌మోహన్‌రెడ్డి దార్శనికతతో ఇన్నాళ్లకు వారికి మంచి రోజులు వచ్చాయి. మాజీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవ తీసుకోవడంతో వైఎస్ జగన్ సర్కారు దండిగా నిధులు మంజూరు చేసింది. నాడు వేసిన బీజం నేడు వారికి మంచి ఫలాలను అందించింది. తళతళలాడే తారు రోడ్లు ముచ్చటగొలిపేలా కనిపిస్తున్నాయి. రహదారి అందుబాటులోకి రావడంతో ఆ నాలుగు గిరిజన గ్రామాలలో గిరిజన సంపదతో పాటు వీరభద్రపేట గ్రామ రైతుల పంటలు చేర్చుకునే వెసులుబాటు కలిగింది.



కొండగడ్డపై నిర్మించిన కల్వర్టు

డోలీ మోతలకు స్వస్తి



నా చిన్నప్పటి నుంచి మాకు రోడ్డు ఉంటే బాగుండును అనుకునేవాళ్లం. ఎన్నికల సమయంలో మా గ్రామానికి ఓట్ల కోసం వచ్చే నాయకులకు మాకు రోడ్డు వెయ్యండని చెప్పేవాళ్లం. హామీ ఇచ్చి తర్వాత మరిచిపోయేవాళ్లు. మా తల రాత ఇంతేనని మేం అడగడం మానేశాం. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత మా బాధని మా నాయకుల ద్వారా బూడి ముత్యాలనాయుడుకు చెప్పాం. రోడ్డు వేస్తానని చెప్పారు. మాట నిలబెట్టుకున్నారు. మేం ఎప్పటికీ జగనన్నకు రుణపడి ఉంటాం. మా గ్రామాల్లో డోలీ మోతల బాధలు తీరి మా వారి ప్రాణాలకు ఊతం దొరికింది.

– బోళం రాము, వార్డు సభ్యుడు, కొండెంపూడి గ్రామం

కల నెరవేరింది



ఇప్పటి వరకు మా కుటుంబ సభ్యులం మూడుసార్లు సర్పంచ్‌లుగా చేశాం. 2006లో నేను సర్పంచ్‌గా ఉన్నప్పుడే అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఈ గ్రామాలకు వెళ్లే నడకదారిని మెటల్ రోడ్డుగా మార్చారు. నాటి నుంచి నేటి వరకు మరే నేత పట్టించుకోలేదు. రహదారి లేక ఆ నాలుగు గ్రామాల గిరిజనులు, మా గ్రామ రైతులు ఇన్నాళ్లు తీవ్రంగా ఇబ్బంది పడ్డాం. ఈ సమస్యను అప్పటి డిప్యూటీ సీఎం బూడి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దృష్టికి తీసుకెళ్లడంతో తారు రోడ్డు మంజూరు చేశారు. వై ఆకారంలో ఉండే ఈ రోడ్డు వీరభద్రపేట నుంచి మూడు కిలోమీటర్లు వెళ్లాక ఒక వైపు కొండెంపూడి, మరొక వైపు గొప్పూరుకు వెళుతుంది. ఈ రోడ్ల పరిధిలోనే ముడిచర్ల, జైపురం గ్రామాలున్నాయి. నేటికి మా కల నెరవేరింది.

–వంటాకు నర్సింహమూర్తి, సర్పంచ్, వీరభద్రపేట

బాధలు తీరాయి



మా తాత, తండ్రుల నుంచి మా నాలుగు గ్రామాల్లో సాయంత్రం అయితే బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోయేవి. వర్షాకాలం అయితే పగటి పూట ఒక్కరూ వెళ్లేందుకు భయమేసేది. దారంతా గోతులు, గతుకులు.. సైకిలు కూడా తొక్కడానికి ఇబ్బంది పడేవాళ్లం. నాలుగు గ్రామాలు కలిపి 300 మంది కూడా లేము. అందువల్లే మా రోడ్డుకు బోలెడంత డబ్బు ఖర్చవుతుందని నాయకులు ముఖం చాటేసేవారు. ఈ సమస్య ఇప్పట్లో పరిష్కారం కాదనుకున్నాం. మాజీ సీఎం జగనన్న రూపంలో మేం కొలిచే దేవతలే ఈ రోడ్డు నిర్మాణానికి ముందుకొచ్చారనుకుంటున్నాం.

– సింగారపు నాగరాజు, గొప్పూరు

నకిలీ కరెన్సీ.. రైస్ పుల్లింగ్..

- జనాన్ని దోచుకుంటున్న ముఠా గుట్టు రట్టు
- ముగ్గురిని అరెస్టు చేసిన నర్సీపట్నం పోలీసులు



నిందితులు, వారి వద్ద దొరికిన నకిలీ కరెన్సీని చూపుతున్న సీఐ రేవతమ్మ, సిబ్బంది

నర్సీపట్నం: సీతారాముల కల్యాణ ఘట్టాన్ని ముద్రించిన మహిమ గల రాగి నాణెం.. రైస్ పుల్లింగ్ చేస్తుంది.. తెల్ల బియ్యంపై పెడితే నల్లరంగులోకి మారిపోతుంది.. అతి విలువైన, అరుదైన ఇరీడియం లోహంగా రూపాంతరం చెందుతుంది.. ఇది మీ వద్ద ఉంటే కుబేరులు కావడం ఖాయం.. అంటూ ఆశ పెడతారు. మాటలతో మాయ చేస్తారు. కనికట్టుతో కట్టి పడేస్తారు. ఇలా రైస్ పుల్లింగ్ కాయిన్ పేరుతో మోసాలకు పాల్పడుతున్న ముఠాను నర్సీపట్నం రూరల్ పోలీసులు గురువారం అరెస్టు చేశారు. రూరల్ సీఐ ఎల్.రేవతమ్మ, నర్సీపట్నం, గొలుగొండ ఎస్సైలు రాజారావు, రామారావు ఈ ముఠా గుట్టు రట్టు చేశారు. సీఐ రేవతమ్మ అందించిన వివరాలు.. నర్సీపట్నం సమీపంలోని నెల్లిమెట్ల జంక్షన్ బుచ్చంపేట వెళ్లే మార్గంలో పోలీసులు తనిఖీలు నిర్వహిస్తుండగా సుజుకి సెలెరియో కారు వద్ద ఐదుగురు వ్యక్తులు అనుమానాస్పదంగా కనిపించారు. వీరిని పోలీసులు అదుపులోకి తీసుకునే ప్రయత్నం చేయగా ముగ్గురు వ్యక్తులు పట్టుబడ్డారు. మరో ఇద్దరు వ్యక్తులు పరారయ్యారు. పట్టుబడిన ముగ్గురి నుంచి రూ.2.60 లక్షల కరెన్సీ నోట్లను, అమెజాన్ చిల్డ్రెన్ బ్యాంకు నుంచి ఆర్డర్ చేసి తెప్పించిన రూ.10 లక్షల నకిలీ కరెన్సీ నోట్లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వీరి వద్ద నుంచి కారు, మూడు సెల్‌ఫోన్లు సీజ్ చేశారు. విజయనగరానికి చెందిన నిమ్మల మనోహర్, తమ్మినేని సుమంత్ కుమార్, నిమ్మల మన్మధ అనే ముగ్గురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామన్నారు. పరారైన నిందితులపై ఐదు కేసులు ఉన్నాయన్నారు. కాయిన్ల పేరుతో ఎవరైనా వస్తే పోలీసు ఎమర్జెన్సీ నంబర్ 1121001903కు సమాచారం అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు.

అక్షరంపై కక్షసాధింపా?



అనకాపల్లిలో ఆర్డీవో షేక్ ఆయిషాకు వినతిపత్రం అందజేస్తున్న పాత్రికేయులు



నర్సీపట్నంలో ఆర్డీవో కార్యాలయం ఇన్‌చార్జి ఏవో అశోక్‌కు వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు, జర్నలిస్టులు

- కలం గొంతు నొక్కితే ఉద్యమిస్తాం
- సాక్షి ఎడిటర్ ఇంట్లో సోదాలపై జర్నలిస్టు సంఘాల నిరసన
- కూటమి సర్కార్ తీరును ఎండగట్టిన పాత్రికేయులు

అనకాపల్లి: ఎలాంటి అనుమతులు, సమాచారం లేకుండా సాక్షి దినపత్రిక ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు అక్రమంగా ప్రవేశించి సోదాలు చేయడాన్ని పలు జర్నలిస్టు సంఘాల నాయకులు తీవ్రంగా ఖండించారు. ప్రభుత్వ అక్రమాలు, అవినీతిని సాక్షి వెలుగులోకి తెస్తుండడంతో కూటమి నేతలు జీర్ణించుకోలేకపోతున్నారని, అందుకే పోలీసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా అంతటా పాత్రికేయులు నిరసన ప్రదర్శనలు చేసి, అధికారులకు వినతి పత్రాలు అందించారు. ముందస్తు సమాచారం లేకుండా సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి ఇంటిలో పోలీసులు అక్రమంగా సోదాలు నిర్వహించడం దారుణమని ఏపీయూడబ్ల్యూజే అనకాపల్లి అధ్యక్షుడు మళ్ల భాస్కరరావు అన్నారు. స్థానిక ఆర్డీవో కార్యాలయంలో ఆర్డీవో షేక్ ఆయిషాకు యూనియన్ ఆధ్వర్యంలో గురువారం వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు ఒక ప్రముఖ దినపత్రిక ఎడిటర్‌తో దురుసుగా ప్రవర్తించడం దుర్మార్గమన్నారు. కూటమి ప్రభుత్వం అక్రమాలు, అవినీతిని సాక్షి వెలుగులోకి తీసుకొస్తోందన్న అక్కసు, కక్షతో పోలీసులతో భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని, ప్రభుత్వం ఉద్దేశపూర్వకంగా ఈ చర్యలకు దిగినట్లు పాత్రికేయ సంఘాలు భావిస్తున్నాయని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండిస్తున్నామని, ఇటువంటి చర్యలను నిలిపివేయాలన్నారు. యూనియన్ పట్టణ ప్రధాన కార్యదర్శి భీమరశెట్టి గణేష్, యూనియన్ జిల్లా కార్యదర్శి ఎ.వెంకట అప్పారావు, పాత్రికేయులు కర్రి గంగాధర్, పెంటకోట సత్యనారాయణ, పి.వీరబాబు, బి.మధుసూదనరావు, వేగి రామచంద్రరావు, పి.సాయి తదితరులు పాల్గొన్నారు.

సాక్షిపై ప్రభుత్వం కక్ష సాధింపు

నర్సీపట్నం: సాక్షిపై ప్రభుత్వం కక్షసాధింపు చర్యలకు పాల్పడటం సరికాదని ఏపీయూడబ్ల్యూజే ఉమ్మడి విశాఖ జిల్లా మాజీ అధ్యక్షుడు సిహెచ్‌బిఎల్ స్వామి, ఏపీ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి కిషోర్ చింతల పేర్కొన్నారు. సాక్షి ఎడిటర్ ధనంజయరెడ్డి నివాసంలో పోలీసులు అక్రమంగా చొరబడి సోదాలకు పాల్పడటాన్ని నిరసిస్తూ పాత్రికేయులు ఆర్డీవో కార్యాలయం ఇన్‌చార్జి ఏవో కె.అశోక్‌కు వినతిపత్రం అంజేశారు. ప్రెస్ క్లబ్ జాయింట్ సెక్రటరీ ప్రభాకర్, సాక్షి స్టాఫ్ రిపోర్టర్ లోవరాజు, పాత్రికేయులు అప్పారావు, నానాజీ, ఎ.డి.బాబు, పాండురంగారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

కష్టాలు చూడలేని కబోది ప్రభుత్వం

కళ్లకు గంతలతో కమ్యూనిటీ హెల్త్ వైద్య సిబ్బంది వినూత్న నిరసన



ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలియజేస్తున్న కమ్యూనిటీ హెల్త్ వైద్య సిబ్బంది

అనకాపల్లి: గ్రామీణ ప్రాంతాల్లో పీహెచ్‌సీల పరిధిలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ హెల్త్ వైద్య సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని గత 12 రోజులుగా సమ్మె చేస్తున్నప్పటికీ కూటమి ప్రభుత్వానికి చీమ కుట్టినట్టయినా లేకుండా పోయిందని ఏపీ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.వి.శ్రీనివాసరావు అన్నారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ వద్ద కమ్యూనిటీ హెల్త్ వైద్య సిబ్బంది కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకుని గురువారం వినూత్న నిరసన తెలియజేశారు. తమ కష్టాలు చూడలేని కబోది ప్రభుత్వమని విమర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకొని చర్చలకు పిలిచి సమస్యను పరిష్కరించాలని కోరారు. కమ్యూనిటీ హెల్త్ వైద్య సిబ్బందికి ఆర్నెల్లకే పర్మినెంట్ చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని, ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేతనం చెల్లిస్తామని ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. కమ్యూనిటీ హెల్త్ వైద్య సిబ్బంది భవాని, యమున, లక్ష్మి, సంధ్య తదితరులు పాల్గొన్నారు.

చికెన్ బిర్యానీలో బల్లి



అనకాపల్లిలోని హోటల్లో చికెన్ బిర్యానీలో కనిపించిన బల్లి

అనకాపల్లి: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి పూడిమడక వెళ్లే రహదారిలో గురువారం రాత్రి ఒక హోటల్లో బిర్యానీలో బల్లి కనిపించడంతో నలుగురు యువకులు బిక్కచచ్చిపోయారు. వెంటనే వారు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రిలో వైద్యుల సూచనల మేరకు ఇంజక్షన్లు తీసుకున్నారు. ప్రస్తుతం వారి పరిస్థితి బాగానే ఉంది.

ఏపీఐఐసీ ప్రాజెక్టు ఏరియాలో ఆర్డీవో పర్యటన



ప్రాజెక్టు ఏరియాలో పనులు పరిశీలిస్తున్న ఆర్డీవో రమణ

నక్కపల్లి: ఏపీఐఐసీ ప్రాజెక్టు ఏరియాలో గురువారం నర్సీపట్నం ఆర్డీవో వి.వి.రమణ పర్యటించారు. ఏపీఐఐసీ సేకరించిన 4500 ఎకరాల్లో బల్క్ డ్రగ్ పార్క్ కోసం 2 వేల ఎకరాలు కేటాయించిన విషయం తెలిసిందే. ఈ ఏరియాలో మౌలిక సదుపాయాలు కల్పించే పనులు జరుగుతున్నాయి. కోట్లాది రూపాయల వ్యయంతో ఇంటర్నల్ రోడ్లు, డ్రెయినేజీలు, తదితర అభివృద్ధి పనులు శరవేగంగా సాగుతున్నాయి. రైతుల నుంచి సేకరించిన భూముల్లో పరిహారం, ప్యాకేజీ చెల్లించిన భూములను ఏపీఐఐసీ వారు స్వాధీనం చేసుకున్నారు. ఈ భూముల్లో ఉన్న కొబ్బరి, జీడి, మామిడి తోటలను తొలగించారు. బల్క్‌డ్రగ్ పార్క్, ఆర్సిలర్ మిట్టల్ స్టీల్‌ప్లాంట్ అవసరాల కోసం అవసరమైన మౌలిక సదుపాయాలను ఏపీఐఐసీ వారే కల్పిస్తున్నారు. ఎస్ఆర్ఆర్ కన్‌స్ట్రక్షన్స్ ఆధ్వర్యంలో సివిల్ పనులు జరుగుతున్నాయి. వీటిని ఆర్డీవో పరిశీలించారు. ఏయే గ్రామాల్లో ఎంత భూమిని ఏపీఐఐసీ స్వాధీనం చేసుకుంది.. ఏయే అభివృద్ధి పనులు ప్రారంభమయ్యాయి.. ఏమైనా అడ్డంకులు ఉన్నాయా.. తదితర వివరాలను ఏపీఐఐసీ అధికారులను అడిగి తెలుసుకున్నారు.

ఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా సూర్యప్రకాష్ బాధ్యతలు



బాధ్యతలు స్వీకరిస్తున్న సూర్యప్రకాష్

విశాఖ సిటీ: ఏపీఈపీడీసీఎల్ ఆపరేషన్స్ డైరెక్టర్‌గా టి.వి.సూర్యప్రకాష్ గురువారం సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. 1986లో ఏపీఎస్ఈబీ కేటీపీఎస్‌లో అసిస్టెంట్ ఇంజనీర్‌గా చేరిన ఆయన పలు విభాగాల్లో విధులు నిర్వర్తిస్తూ ఏపీఈపీడీసీఎల్ చీఫ్ జనరల్ మేనేజర్ హోదాలో 2021లో పదవీ విరమణ పొందారు. ఆయన తాజాగా ఈపీడీసీఎల్ డైరెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడంతో పాటు రైతులకు పగటిపూట 9 గంటల ఉచిత విద్యుత్‌ను అందించేందుకు కృషి చేస్తానని తెలిపారు. అలాగే గ్రామీణ ప్రాంతాలకు 24/7 3-ఫేజ్ విద్యుత్‌ను అందించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సూర్యప్రకాష్‌ను సీఎండీ పృథ్వీతేజ్ ఇమ్మడి, డైరెక్టర్లు డి.చంద్రం, టి.వనజ అభినందించారు.

సీనియారిటీ జాబితా విడుదల

విశాఖ విద్య : ఉత్తరాంధ్రలో ప్రభుత్వ యాజమాన్యాల పరిధి పాఠశాలల్లో స్కూల్ అసిస్టెంట్ల ఉద్యోగోన్నతులకు (గ్రేడ్–2 హెచ్‌ఎం) సంబంధించిన తుది సీనియారిటీ జాబితాను విడుదల చేసినట్లు ఆర్జేడీ బి.విజయభాస్కర్ తెలిపారు. వెబ్‌సైట్‌లో జాబితాలు అందుబాటులో ఉన్నాయన్నారు. సీనియారిటీ జాబితాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీలోగా మధురవాడలో గల ప్రాంతీయ సంయుక్త సంచాలకుడు కార్యాలయంలో తగిన ధృవీకరణ పత్రాలతో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

సింహాచలం ఈవోని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు



కె.సుబ్బారావు, దేవస్థానం ఈవో

సింహాచలం: చందనోత్సవం నాడు సింహగిరిపై గోడ కూలి ఏడుగురు భక్తులు దుర్మరణం పాలైన ఘటనలో దేవస్థానం ఈవో కె.సుబ్బారావును సస్పెండ్ చేస్తూ రెవెన్యూ(విజిలెన్స్) డిపార్ట్‌మెంట్ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.జయలక్ష్మి గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆయన ఎలాంటి పర్మిషన్ లేకుండా హెడ్ క్వార్టర్స్ దాటి వెళ్లరాదని పేర్కొన్నారు. ఈ ఘటనపై ప్రభుత్వం నియమించిన త్రిసభ్య కమిషన్ ఇచ్చిన ప్రాథమిక నివేదిక ఆధారంగా దేవస్థానం ఈవోతో పాటు ఈఈ డీజీ శ్రీనివాసరాజు, డిప్యూటీ ఈఈ కేఎస్ఎన్ మూర్తి, జేఈ కె.బాబ్జీతో పాటు ఏపీటీడీసీకి చెందిన ఈఈ కె.రమణ, డిప్యూటీ ఈఈ ఏబీవీఎల్ఆర్ స్వామి, ఏఈ పి.మదన్ మోహన్‌లను సస్పెండ్ చేసిన విషయం తెలిసిందే. మిగతా ఆరుగురి సస్పెన్షన్ ఆర్డర్లు గురువారం సాయంత్రానికి వచ్చినట్లు చెబుతున్నా.. ఇంకా అధికారికంగా ప్రకటించలేదు.

క్లుప్తంగా

మోదకొండమ్మ తల్లికి వెండి కవచం, త్రిశూలం



మోదకొండమ్మకు వెండికవచం, త్రిశూలం అలంకరిస్తున్న భక్తులు

మాడుగుల: ఉత్తరాంధ్రుల ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ అమ్మవారి పండగ వచ్చే నెల 3వ తేదీన జరగనున్న నేపథ్యంలో వెండి కవచం, వెండి త్రిశూలం చేయించారు. వాటిని గురువారం అమ్మవారికి అలంకరించారు. ఈ ఏడాది జాతర అంగరంగ వైభవంగా నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు తెలిపారు. ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎంపీపీ తాళ్లపు రెడ్డి వెంకట రాజారామ్, ఆర్యవైశ్య సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనాథు శ్రీనివాసరావు, సర్పంచ్ ఎడ్ల కళావతి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

వాడపల్లికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

దాబాగార్డెన్స్ : తూర్పుగోదావరి జిల్లా వాడపల్లి వేంకటేశ్వర స్వామి ఆలయానికి వెళ్లే భక్తుల కోసం ఏపీఎస్ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు నడుపుతుందని జిల్లా ప్రజా రవాణా అధికారి బి.అప్పలనాయుడు పేర్కొన్నారు. ప్రతి శనివారం ఉదయం 4 గంటలకు ద్వారకా బస్‌స్టేషన్ నుంచి బయలుదేరి వాడపల్లి చేరుకుంటుందని, భక్తుల ప్రదక్షిణలు, స్వామి దర్శనం అనంతరం సాయంత్రం 4 గంటలకు వాడపల్లిలో బయలుదేరి రాత్రి 9 గంటలకు విశాఖపట్నం చేరుకుంటుందని చెప్పారు. ప్రయాణ చార్జీ(ఒక్కొక్కరికి) సూపర్ లగ్జరీ రూ.1000గా నిర్ణయించామని, టికెట్లు కావల్సిన వారు https://www.apsrtconline.in లో రిజర్వ్ చేసుకోవాలని కోరారు. వివరాలకు 9959225602, 9052227083, 9959225594, 9100109731 నంబర్లలో సంప్రదించవచ్చన్నారు.

జ్యోతి వెడ్స్ రాఘవేంద్ర

- ఒక్కటవుతున్న అంధులు
- అనంతపురం అబ్బాయితో విశాఖ అమ్మాయికి వివాహం
- రేపు పెళ్లిరాట
- 11న ప్రేమసమాజం వేదికగా కల్యాణం

స్పందించే హృదయముంటే.. చూపుతో పనేముంది? కన్నులు లేకున్నా ప్రేమ వెలుగే జీవితానికి దారి చూపుతుందంటూ వివాహ బంధంతో ఒకటవుతున్నారు ఆ జంట. కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్ర తనలాగే కంటి చూపులేని తన నెచ్చెలినే జీవిత భాగస్వామిగా ఎన్నుకున్నాడు.

విధి వంచించినా.. ప్రేమ సమాజం పంచిన ప్రేమతో వెలిగింది శివజ్యోతి. ఇద్దరూ అక్షరాల ఆసరాగా ఎదిగారు. ఒకరికొకరు తోడుగా నిలవాలని కోరుకున్నారు. చీకటి కన్నుల్లో మెరిసిన ఆ వెలుగు రేఖలు భవిష్యత్తుకు బంగారు బాటలు చూపగా.. తమ కలలను సాకారం చేసుకునే దిశగా అడుగులు వేస్తోంది ఆ జంట. ఈ నెల 11న వారి కల సాకారం కానుంది. ప్రేమబంధం ఏడు అడుగులతో పవిత్రబంధంగా మారనుంది.

– దాబాగార్డెన్స్



ప్రేమ సమాజం ముంగిట పెళ్లి సందడి నెలకొంది. ప్రేమ సమాజం కంచర్ల అన్నపూర్ణాదేవి వేదికగా, ప్రేమ సమాజం ఆశ్రిత శివజ్యోతి, అనంతపురం జిల్లా బుక్కపట్నం గ్రామానికి చెందిన ఎనుముల గంగన్న, నారాయణమ్మల కనిష్ట పుత్రుడు, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగి రాఘవేంద్రల వివాహానికి సర్వం సిద్ధమైంది. వేద మంత్రాలు, పచ్చని తోరణాలు, బాజా భజంత్రీలు, మంగళ వాయిద్యాల నడుమ, దాతల దీవెనలతో ఈ వేడుక కన్నుల పండుగగా జరగనుంది. విందు భోజనాలతో ప్రేమ సమాజం కళకళలాడనుం డగా, పెద్దల ఆశీస్సులతో ఈ అంధుల జంట ఒక్కటి కానుంది.

గత నెల 11న పెద్దలు ఈ పెళ్లి తంతుకు శ్రీకారం చుట్టారు. ఇరువురూ అంధులే కావడం విశేషం. చూపులేని యువకుడు, తనలాంటి తోడు కోసం ఎదురుచూసి, ఆ కలను నిజం చేసుకుంటున్న శుభ తరుణమిది. ఈ అరుదైన వివాహం పట్ల సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతు న్నాయి. వివరాల్లోకి వెళితే, జన్మతః అంధుడైన ఎనుమోలు రాఘవేంద్ర బీకాం కంప్యూటర్స్ పూర్తి చేసి, ప్రస్తుతం కోయింబత్తూర్ పీఎఫ్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తున్నారు.



తాంబూలాలు పుచ్చుకున్న ఇరు కుటుంబాలు

రాఘవేంద్ర తల్లిదండ్రులది అనంతపురం జిల్లా బుక్కపట్నం మండలం సిద్దరాంపురం. వ్యవసాయ నేపథ్యం కలిగిన వారి కుటుంబంలో రాఘవేంద్ర తనలాంటి కంటి చూపులేని అమ్మాయినే వివాహం చేసుకోవాలని కోరుకున్నాడు. ఆయన కోరిక మేరకు, రాఘవేంద్ర సోదరుడు రమణ కొందరు అందించిన సమాచారం ద్వారా విశాఖలోని ప్రేమ సమాజం ప్రతినిధులను సంప్రదించారు. దీంతో ఈ వివాహానికి మార్గం సుగమమైంది.

రేపు పెళ్లి రాట

ప్రేమ సమాజం ప్రాంగణంలో శనివారం పెళ్లి రాట కార్యక్రమం జరగనుండగా, శివజ్యోతిని పెళ్లి కుమార్తెగా ముస్తాబు చేయనున్నారు. మే 11న రాత్రి 7.05 గంటలకు స్వాతి నక్షత్రయుక్త వృశ్చిక లగ్నంలో రాఘవేంద్ర, శివజ్యోతిలు ఒక్కటి కానున్నారు. ఈ శుభ సందర్భానికి విచ్చేసిన అతిథులు, వధూవరుల కుటుంబ సభ్యుల కోసం ప్రత్యేక విందు భోజనం ఏర్పాటు చేశారు. ప్రేమ సమాజం వేదికగా జరుగుతున్న ఈ అపురూపమైన వేడుక అందరినీ ఆనందంలో ముంచెత్తుతోంది.

ప్రేమసమాజమే తల్లిగా..

మరోవైపు, శివజ్యోతి పుట్టుకతోనే కంటి చూపును, తల్లిదండ్రులను కూడా కోల్పోయింది. నగరంలోని వివేకానంద చారిటబుల్ ట్రస్ట్ సిఫార్సుతో ఆమెకు ప్రేమ సమాజం ఆశ్రయం కల్పించింది. చినజీయర్ స్వామి అంధుల పాఠశాలలో ఇంటర్మీడియట్, నగరంలోని విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బీఏ పూర్తి చేసింది. ఇరువురి అంగీకారంతో, ప్రేమ సమాజం వేదికగా గత నెలలో తాంబూలాలు మార్చుకున్నారు. ఈ నెల 11న వివాహ ముహూర్తం ఖరారైంది. ప్రేమ సమాజం అధ్యక్షుడు బుద్ధ శివాజీ, కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో శివజ్యోతి తరపున పెద్దలుగా వ్యవహరిస్తున్నారు.

దట్టమైన అటవీ ప్రాంతం నుంచి కాలినడకన..

ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను మోసుకువచ్చిన పోలీసు బలగాలు

రంపచోడవరం: వై.రామవరం పోలీసుస్టేషన్ పరిధిలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టులు పండన్న, రమేష్ మృతదేహాలను గురువారం సాయంత్రం స్థానిక ఏరియా ఆస్పత్రి మార్చురీకి తీసుకువచ్చారు. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల సమయంలో పోలీసులు, మావోయిస్టులకు మధ్య శేషరాయి అటవీ ప్రాంతంలో కాల్పులు చోటు చేసుకోవడం తెలిసిందే. సంఘటన స్థలం నుంచి వారి మృతదేహాలను తీసుకురావడానికి పోలీసులకు సుమారు 28 గంటల సమయం పట్టింది. మృతదేహాలను కర్రకు కట్టి దట్టమైన అటవీ ప్రాంతం నుంచి సుమారు 10 కిలోమీటర్ల మేర కాలినడకన మోసుకువచ్చి శేషరాయి చేర్చారు. అక్కడి నుంచి అంబులెన్సులో వై.రామవరం మీదుగా స్థానిక ఏరియా ఆస్పత్రికి తీసుకువచ్చారు.

నేడు స్వగ్రామానికి పండన్న మృతదేహం.. తీసుకువచ్చేందుకు వెళ్లిన కుటుంబ సభ్యులు

సీలేరు: వై.రామవరం పోలిస్‌స్టేషన్ పరిధి శేషరాయి అటవీ ప్రాంతంలో బుధవారం జరిగిన ఎదురుకాల్పుల్లో మృతి చెందిన మావోయిస్టు కాకూరి పండన్న మృతదేహాన్ని శుక్రవారం స్వగ్రామం కొమ్ములవాడ తీసుకురానున్నారు. ఈ మేరకు అతని తమ్ముడు అప్పన్న, మరదలు వరహాలమ్మ, అల్లుడు వెంకట్రావు, దుప్పులవాడ సర్పంచ్ కుమారి, మరో ఆరుగురు గురువారం ఆస్పత్రికి వెళ్లారు. పోస్టుమార్టం అనంతరం స్వగ్రామం తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించేందుకు కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు.



కాలినడకన మోసుకుని మావోయిస్టుల మృతదేహాలను తీసుకువస్తున్న పోలీసు బలగాలు

పూర్తిగా పట్టుకోల్పోయిన మావోయిస్టులు

- పండన్నపై 400, రమేష్‌పై 30 కేసులు
- ఇప్పటికైనా మిగతావారు, సానుభూతిపరులు లొంగిపోవాలి
- ఎస్పీ అమిత్‌బర్దర్

రంపచోడవరం: సరెండర్లు, అరెస్టుల నేపథ్యంలో మావోయిస్టులు పూర్తిగా పట్టుకోల్పోయారని ఎస్పీ అమిత్ బర్దర్ అన్నారు. వై.రామవరం మండలం శేషరాయి అటవీ ప్రాంతంలో జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందడం తెలిసిందే. ఈ నేపథ్యంలో గురువారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఇందుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. శేషరాయి అటవీ ప్రాంతంలో కూంబింగ్ ఆపరేషన్‌కు వెళ్తున్న పోలీసులను చూసిన 15 మంది మావోయిస్టులు కాల్పులు జరిపారన్నారు. దీంతో పోలీసు బలగాలు కూడా కాల్పులు జరిపిన క్రమంలో మావోయిస్టులు కాకూరి పండన్న అలియాస్ జగన్, రమేష్ మృతి చెందారన్నారు. పండన్నపై 400 వరకు కేసులు ఉన్నాయన్నారు. అతనిపై రూ.20 లక్షల నగదు రివార్డు ఉందన్నారు. మల్కన్‌గిరి జిల్లా కలిమెలకు చెందిన రమేష్‌పై 30 క్రిమినల్ కేసులు నమోదు కాగా రూ.8 లక్షల నగదు రివార్డు ఉందన్నారు. సంఘటన స్థలంలో రెండు ఏకే 47, 303 రైఫిల్, నాలుగు మ్యాగ్జిన్స్, ఏకే 47 మ్యాగ్జిన్స్ 3, కిట్ బ్యాగ్‌ల్లో విప్లవ సాహిత్యం, రూ.98వేల నగదు, మందులు, ఆలివ్ గ్రీన్ యూనిఫాం లభ్యమయ్యాయన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్ తరువాత ఏవోబీ సుమారు 30 మావోయిస్టులు జిల్లాలోకి వచ్చినట్టు సమాచారం ఉందన్నారు. పోలీసు యంత్రాంగం అప్రమత్తమై గట్టి నిఘా, కూంబింగ్ చేపట్టిందన్నారు. మావోయిస్టు పార్టీలో కీలక నేతలు అరుణ, ఉదయ్ ఈ ప్రాంతంలో సంచరిస్తున్నారన్నారు. ఎన్‌కౌంటర్ తరువాత మావోయిస్టుల సంఖ్య 13కు తగ్గిపోయిందన్నారు. ఆరు నెలలుగా గిరిజన గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి యువతను ఆకట్టుకునే ప్రయత్నం చేశారన్నారు. దీనిపై వారి నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. గిరిజన ప్రాంతం అభివృద్ధికి అధికార యంత్రాంగం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. ఇప్పటికైనా మావోయిస్టులు, సానుభూతిపరులు లొంగిపోవాలని ఎస్పీ సూచించారు. ఎవరైనా వారికి సహకరించినా, వారిని ప్రోత్సహించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ప్రస్తుతం కూంబింగ్ కొనసాగుతోందన్నారు. పోస్టుమార్టం అనంతరం ఇద్దరు మావోయిస్టుల మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగిస్తామన్నారు. ఛత్తీస్‌గఢ్ ప్రాంతంలో మావోయిస్టులు లొంగిపోతున్నారన్నారు. ఈ సమావేశంలో చింతూరు ఏఎస్పీ పంకజ్‌కుమార్ మీనా, అడిషనల్ ఎస్పీ కె.ధీరజ్, రంపచోడవరం డీఎస్పీ సాయిప్రశాంత్ పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న తుపాకులు, తూటాలు, ఇతర సామగ్రిని పరిశీలిస్తున్న ఎస్పీ తదితరులు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్పీ అమిత్‌బర్దర్

మున్సిపల్ వైస్ చైర్మన్‌లపై అవిశ్వాసం నోటీసు

యలమంచిలి రూరల్: యలమంచిలి మున్సిపల్ వైస్ చైర్మన్‌లు బెజవాడ గోవిందరాజు నాగేశ్వరరావు, అర్రెపు నాగ త్రినాథ ఈశ్వర గుప్తాలపై అవిశ్వాసం కోరుతూ జిల్లా కలెక్టర్‌కు గురువారం వార్డు కౌన్సిలర్లు నోటీసు ఇచ్చారు. ఇందుకోసం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి బల పరీక్ష నిర్వహించాలని నోటీసులో పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ ముఖ్యమైన వీడియో కాన్ఫరెన్స్‌లో ఉండడంతో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణకు నిర్దేశిత ప్రొఫార్మాలో పూరించిన ఫారాన్ని అందజేశారు. నోటీసుపై 17 మంది వార్డు కౌన్సిలర్ల సంతకాలు ఉన్నాయి. యలమంచిలి మున్సిపాలిటీలో మొత్తం 25 మంది వార్డు కౌన్సిలర్లు ఉండగా.. 23 మంది వైఎస్సార్‌సీపీ వార్డు సభ్యులు, టీడీపీకి ఒకరు, స్వతంత్ర అభ్యర్థి ఒకరు గెలుపొందారు. అయితే అధికారంలోకి వచ్చిన తర్వాత వార్డు కౌన్సిలర్లను ప్రలోభపెట్టిన కూటమి నాయకులు ఇటీవల కొద్దిరోజుల క్రితం మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారిపై వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు పెట్టిన అవిశ్వాసం వీగిపోయేలా చేసిన సంగతి తెల్సిందే. తాజాగా వైఎస్సార్‌సీపీ తరఫున కొనసాగుతున్న మున్సిపల్ వైస్ చైర్మన్లపై వార్డు కౌన్సిలర్లు అవిశ్వాసం కోరుతూ నోటీసు ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ విషయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తికరమైన చర్చ జరుగుతోంది.



డీఆర్వో సత్యనారాయణకు నోటీసు అందజేస్తున్న వార్డు కౌన్సిలర్లు

'ఆపరేషన్ సిందూర్'కు మాజీ సైనికుల మద్దతు



జాతీయ జెండాలతో మద్దతు తెలుపుతున్న మాజీ సైనికులు

నర్సీపట్నం: యుద్ధం సంభవిస్తే దేశం తరఫున పోరాటానికి సిద్ధమంటూ మాజీ సైనికులు నర్సీపట్నంలో బుధవారం జాతీయ జెండాలతో మద్దతు తెలియజేశారు. పర్యాటకులను పొట్టన పెట్టుకున్న ఉగ్రవాదులను ఆపరేషన్ సిందూర్ ద్వారా హతమార్చడాన్ని సంతోషానిచ్చిందన్నారు. వివిధ పోరాటాల్లో పని చేసిన అనుభవం ఉందని పేర్కొన్నారు. ఒకవేళ నిజంగా యుద్ధమే జరిగితే ఎలా ఎదుర్కొవాలో ప్రజలకు అవగాహన ఉండాలన్నారు.

22 మంది జూదరుల అరెస్ట్

నరవలో పట్టుబడినవారు కూటమి ప్రభుత్వ కీలక నేత అనుచరులు

పెందుర్తి: స్థానిక పోలీస్ స్టేషన్ పరిధిలోని జీవీఎంసీ 88వ వార్డు నరవ, పెందుర్తి మండలం ఎస్ఆర్ పురం ప్రాంతాల్లో జూదమాడుతున్న 22 మందిని టాస్క్‌ఫోర్స్ పోలీసులు గురువారం రాత్రి పట్టుకున్నారు. పశ్చిమ నియోజకవర్గం గోపాలపట్నం ప్రాంతానికి చెందిన 10 మంది నాణేలు ఎగురవేసే ఆట ఆడుతున్నట్లు నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం అందింది. దీనిపై వెంటనే రంగంలోకి దిగిన పోలీసులు నరవ ప్రాంతంలో జూదమాడుతున్న వీరిని పట్టుకున్నారు. వీరిలో చాలా మంది కూటమిలోని ప్రధాన పార్టీకి చెందిన అసెంబ్లీలో ఓ కీలక ప్రజాప్రతినిధి అనుచరులు ఉన్నట్లు తెలుస్తోంది. కూటమి అధికారంలోకి వచ్చిన కొద్ది రోజుల తరువాత వీళ్లు జూదంలో నరవ ప్రాంతంలోనే గతంలో పోలీసులకు పట్టుబడ్డారు. తాజాగా మళ్లీ వారే అదే నాణేల జూదంలో పోలీసులకు చిక్కడం గమనార్హం. కాగా పెందుర్తి మండలం ఎస్ఆర్ పురంలో 12 మంది పేకాట ఆడుతూ టాస్క్‌ఫోర్స్ పోలీసులకు పట్టుబడ్డారు. మొత్తం 22 మంది నిందితులను పెందుర్తి పోలీస్ స్టేషన్‌కు అప్పగించినట్లు సమాచారం.

10లోగా అభ్యంతరాలు తెలపండి

అనకాపల్లి టౌన్: జిల్లాలో గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు (గ్రేడ్-2) పదోన్నతి కోసం సీనియారిటీ జాబితాపై అభ్యంతరాలు ఉంటే ఈ నెల 10వ తేదీలోగా సమర్పించాలని జిల్లా విద్యాశాఖాధికారి గిడ్డి అప్పారావు నాయుడు తెలిపారు. విశాఖలోని పాఠశాల విద్యాశాఖ జోన్-1 ప్రాంతీయ సంచాలకుడి కార్యాలయంలో తగు ఆధారాలతో అభ్యంతరాలు అందజేయాలన్నారు.

హోంగార్డు కుటుంబానికి రూ.4.26 లక్షల సాయం



హోంగార్డు భార్య పార్వతమ్మకు చెక్కు అందిస్తున్న ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి: పోలీస్ శాఖలో హోంగార్డు సేవలు అభినందనీయమని ఎస్పీ తుహిన్ సిన్హా అన్నారు. ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన హోంగార్డు అర్లబు నారాయణ భార్య పార్వతమ్మకు హోంగార్డుల ఒక రోజు వేతనాన్ని గురువారం స్థానిక ఎస్పీ కార్యాలయంలో తుహిన్ సిన్హా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు సబ్ డివిజన్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ అనారోగ్యంతో నారాయణ ఇటీవల మృతి చెందారన్నారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో విధులు నిర్వహిస్తున్న హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.4,26,385 చెక్కును మృతుడి భార్యకు అందజేశారన్నారు. విధి నిర్వహణలో మృతి చెందిన, పదవీ విరమణ పొందిన వారి కుటుంబాలను ఆదుకునేందుకు మిగతా హోంగార్డులు ముందుకు రావడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో కార్యాలయంలో ఏవో రామ్‌కుమార్, జూనియర్ అసిస్టెంట్ టి.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ కాంప్లెక్స్‌లో విస్తృత తనిఖీలు



ఆర్టీసీ బస్సులో తనిఖీ చేస్తున్న టూటౌన్ సీఐ ఎర్రంనాయుడు

అల్లిపురం: పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు ఆర్టీసీ కాంప్లెక్స్, చావులమదుం, గొల్లలపాలెం ప్రాంతాల్లో టూటౌన్ పోలీసులు తనిఖీలు నిర్వహించారు. సీఐ వీవీసీఎం ఎర్రంనాయుడు ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ సిబ్బందితో కలిసి ఆర్టీసీ కాంప్లెక్స్, బస్సుల్లో ప్రయాణికులు బ్యాగులు, సూట్‌కేసులు తనిఖీ చేశారు. గంజాయి, అనుమానాస్పద వెపన్స్, మాదక ద్రవ్యాలు రవాణా చేస్తున్నారేమో అని తనిఖీలు చేపట్టారు. అదే విధంగా టూటౌన్ ఎస్ఐలు సింహాచలం, మన్మథరావు తమ సిబ్బందితో కలిసి గొల్లలపాలెం, చావులమదుం జంక్షన్లలో వాహనాలు తనిఖీ చేశారు.

ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలు



రామారాయుడుపాలెంలో సాగులో ఉన్న వరి దుబ్బును పరిశీలిస్తున్న వ్యవసాయాధికారులు

యలమంచిలి రూరల్: ప్రకృతి వ్యవసాయంతో ఎన్నో ప్రయోజనాలున్నాయని జిల్లా వ్యవసాయాధికారి వ్యవసాయాధికారి మోహన్‌రావు అన్నారు. మండలంలోని రామారాయుడుపాలెం, పోతురెడ్డిపాలెం, తురంగలపాలెం గ్రామాల్లో రబీ సీజన్‌లో సాగు చేస్తున్న వరి ఎన్ఎల్ఆర్ 3648 రకం పైరును గురువారం ఆయన పరిశీలించారు. ఈ రకం వరి వంగడాలు తెగుళ్లను సమర్థవంతంగా తట్టుకుంటాయన్నారు. వరి దుబ్బులను పరిశీలించిన తర్వాత అధిక దిగుబడి పొందవచ్చన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. వచ్చే ఖరీఫ్ సీజన్‌లో మండలంలో సుమారు 2వేల ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ పంటలను సాగు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిపారు. ప్రకృతి వ్యవసాయం సాగు వల్ల రైతులకి, భూమికి, పర్యావరణానికి, ప్రధాన పంట వినియోగదారునికి కలిగే ప్రయోజనాలను ఏవో రైతులకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన వివిధ రకాల విత్తనాలను వేయడం ద్వారా ఎకరాకు వచ్చే పంట దిగుబడిపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఏవోలు పాలిమేర మోహన్‌రావు, సుమంత, సౌజన్య, శంకర్ గోవింద్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, ప్రకృతి వ్యవసాయం సిబ్బంది పాల్గొన్నారు.

కుట్టు శిక్షణలో అవినీతిపై దర్యాప్తు చేయాలి

అనకాపల్లి: బీసీ మహిళల కుట్టు శిక్షణలో రూ.245 కోట్లలో సుమారుగా రూ.167 కోట్లు అవినీతికి పాల్పడిన వ్యక్తులపై కూటమి ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని వైఎస్సార్‌సీపీ బీసీసెల్ జిల్లా అధ్యక్షుడు ఉద్దండం త్రినాథరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు స్థానిక కలెక్టర్ కార్యాలయంలో జేసీ జాహ్నవి గురువారం ఆయన వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ మహిళలకు కుట్టు శిక్షణ ఇవ్వడం అభినందనీయమని, మిషన్ల కొనుగోళ్లలో జరిగిన అవినీతిపై పూర్తి స్థాయి దర్యాప్తు చేయాలన్నారు. మొత్తం బీసీ లబ్ధిదారులు లక్ష మందికి ఒక్కొక్కరికి రూ.23 వేలు చొప్పున ఖర్చు అవుతుందని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. ఒక బీసీ లబ్ధిదారునికి కుట్టు మిషన్, శిక్షణకు అయ్యే మొత్తం ఖర్చు రూ.7,300 అవుతుంటే మొత్తం లక్ష మంది మహిళలకు రూ.73 కోట్లు ఖర్చు అవుతుందని చెప్పారు. అయితే ఈ శిక్షణలో జరిగిన రూ.167 కోట్ల అవినీతిపై కేంద్ర ప్రభుత్వం తక్షణమే దర్యాప్తు చేసి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆయన డిమాండ్ చేశారు. అంతకుముందు రింగ్ రోడ్డులోని పార్టీ కార్యాలయంలో త్రినాథరావు విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో యలమంచిలి జెడ్పీటీసీ సేనాపతి సంధ్యారాము, పార్టీ యలమంచిలి బీసీసెల్ అధ్యక్షుడు బి.చల్లయ్య నాయుడు, పార్టీ సీనియర్ నాయకులు కరణం వెంకటరమణ, యల్లపు గాంధీ, మొగలిపల్లి సుబ్బారావు, దాడి నారాయణరావు, జామి వెంకటరమణ, సింహాద్రి రమణ పాల్గొన్నారు.



జేసీ జాహ్నవికి వినతిపత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు త్రినాథరావు

స్నేహితుడి ఇంట్లో చోరీ.. నిందితుడి అరెస్ట్

పెదగంట్యాడ: మండలంలోని దయాల్‌నగర్‌లో తాళం వేసి ఉన్న ఇంట్లో చొరబడి చోరీ చేసిన నిందితుడు కాంబలి దిలీప్‌ను న్యూపోర్టు పోలీసులు అరెస్టు చేశారు. ఈ విషయాన్ని హార్బర్ క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు గురువారం న్యూపోర్టు పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. దయాల్‌నగర్‌కు చెందిన బేర రాజు ఈ నెల 4న తన కుటుంబంతో కలిసి స్వగ్రామమైన పాడేరు మండలం సలుగు వెళ్లారు. రాజు కుటుంబం ఊరిలో లేని విషయాన్ని అతని స్నేహితుడైన కంచరపాలెం బర్మా క్యాంప్‌కు చెందిన దిలీప్ తెలుసుకున్నాడు. ఈ నెల 5న అర్ధరాత్రి సమయంలో రాజు ఇంటికి చొరబడి, బీరువాలో ఉంచిన బంగారు పుస్తెలతాడు, రెండు చెయిన్లు, ఒక గొలుసు, ఒక బ్రేస్‌లెట్, ఒక చిన్న ఉంగరం, ఒక లాకెట్‌తో పాటు రూ. 20 వేల నగదును దొంగిలించాడు. ఈ నెల 6న తిరిగి వచ్చిన రాజు ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండటం, బీరువా తెరిచి ఉండటం చూసి చోరీ జరిగినట్లు గుర్తించి న్యూపోర్టు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. క్రైం డీసీపీ పర్యవేక్షణలో క్రైం సీఐ జి. శ్రీనివాస్ కేసు దర్యాప్తు చేపట్టారు. గురువారం నిందితుడిని కంచరపాలెంలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతంలోని సర్వీస్ రోడ్డులో అదుపులోకి తీసుకున్నారు. ఏసీపీ లక్ష్మణరావు మాట్లాడుతూ, నిందితుడు చిన్నప్పటి నుంచి చెడు వ్యసనాలకు బానిసయ్యాడని, జల్సాలకు అలవాటు పడ్డాడని తెలిపారు. నిందితుడిపై గతంలో అనకాపల్లి జిల్లా చీడికాడ, అల్లూరి సీతారామరాజు మన్యం జిల్లా పాడేరు పోలీస్ స్టేషన్లలో కూడా చోరీ కేసులు ఉన్నాయని వివరించారు. నిందితుడి నుంచి చోరీ సొత్తును స్వాధీనం చేసుకున్నామని ఎస్ఐ అప్పలరాజు చెప్పారు.



వివరాలు వెల్లడిస్తున్న హార్బర్ క్రైమ్ ఏసీపీ లక్ష్మణరావు

క్లుప్తంగా

తగ్గిన టమాటా ధర

కశింకోట: స్థానిక వారపు సంతలో గురువారం టమాటా ధర తగ్గింది. గత వారం కిలో రూ.30 ఉండగా, ఈ వారం రూ. పది తగ్గింది. రూ.20కి అమ్మకాలు సాగాయి. ఉల్లి కూడా ఇదే ధరకు విక్రయించారు. బంగాళదుంప, వంకాయ, బెండకాయ, క్యాబేజి రూ.30, క్యారెట్, బీట్రూట్, గోరు చిక్కుడు రూ.40, చామదుంప రూ.60, క్యాప్సికం, పెద్ద చిక్కుడు రూ.80కి విక్రయాలు సాగాయి.

విద్యార్థులకు చదరంగం పోటీ



విద్యార్థులకు నిర్వహిస్తున్న చదరంగం పోటీ

కశింకోట: మండలంలోని తాళ్లపాలెం శాఖ గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు వివిధ ఆటల పోటీలు నిర్వహించారు. వేసవి విజ్ఞాన శిబిరం తరగతుల్లో భాగంగా 8వ రోజు చదరంగం, లుడో, కళ్ల గంతలాట పోటీలు నిర్వహించారు. వీటికి విద్యార్థులు ఉత్సాహంగా హాజరయ్యారు. గ్రంథాలయ అధికారి కె.జగన్నాథం ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు.

వారపు సంత వెలవెల



తీవ్ర ఎండకు వెలవెల బోయిన కశింకోట వారపు సంత

కశింకోట: భానుడు ఉగ్రరూపంతో గురువారం స్థానిక వారపు సంత వెలవెలబోయింది. ఉదయం 11 గంటల వరకు అడపాదడపా సంత సాగిన తర్వాత ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో ప్రజలు కొనుగోలు చేయడానికి ముందుకు రాలేదు. దీంతో కొనుగోలుదారులు లేక కాయగూరలు, మసాల దినుసుల దుకాణాలు, వస్త్రాలు, పండ్లు, చేపలు వగైరా దుకాణాలు వెలవెలబోయాయి. 38 డిగ్రీలు ఎండ నమోదు అయింది. మధ్యాహ్నం 3 గంటలకు ఆకాశంలో మబ్బులు వేసి వాతావరణం చల్లబడటంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఒక్కొక్కరుగా క్రమేపీ ప్రజలు తరలివచ్చి సంతలో కూరగాయలు, ఇతర సరుకులు కొనుగోలు చేశారు. దాంతో ముమ్మరంగా సాయంత్రం వరకు సంత సాగింది.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

అనకాపల్లి టౌన్: మండలంలోని తుమ్మపాల పంచాయతీ కార్యాలయం వద్ద శుక్రవారం ఉదయం 10 గంటలకు ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు గ్రామ సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు తెలిపారు. గ్రామంలో కంటి సమస్యలతో బాధపడుతున్న వారందరూ హాజరు కావాలని కోరారు. తమ వెంట ఆధార్ కార్డు తీసుకురావాలని సూచించారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 367 దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	4,350	4,960
రెండో రకం	4,100	4,300
మూడో రకం	3,630	3,800

అనకాపల్లి సినిమాలు

రాజా	: రెట్రో
సత్యనారాయణ స్క్రీన్-1	:శుభం
సత్యనారాయణ స్క్రీన్-2:	జగదీక వీరుడు అతిలోక సుందరి
పర్తిసాయి	:హిట్-3
షిర్డీసాయి	సింగిల్
వెంకటేశ్వర	:సీఎం పెళ్లాం
శ్రీ సత్య	: సారంగపాణి జాతకం
రామచంద్ర	:తుడురుమ్

రక్త నిల్వలు

అనకాపల్లి: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 55 యూనిట్ల రక్త నిల్వ ఉంది. ఏ పాజిటివ్ 17 యూనిట్లు, బీ పాజిటివ్ -14, ఓ పాజిటివ్ -22, ఏబీ పాజిటివ్ -3 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంక్ టెక్నీషియన్ యు. లోకేష్ 9703619706ను సంప్రదించాలని కోరారు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 358 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ప్రతినిధి 08924-223595 నెంబర్‌ను సంప్రదించవచ్చు.

ఆటో ఇటో కాని బతుకులు



ఆటోలు



రూ.15 వేల సాయం అమలు చేయాలని ధర్నా చేస్తున్న ఆటో యూనియన్ నాయకులు(ఫైల్)

- **ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేలు ఎక్కడ?**
- **ఏడాదవుతున్నా అమలు కాని కూటమి హామీ**
- **అపరాధ రుసుం, జరిమానాలతో వేధింపులు**
- **తీవ్ర ఆర్థిక ఇబ్బందుల్లో ఆటోవాలాలు**

అనకాపల్లి: కూటమి ప్రభుత్వం సూపర్ సిక్స్ పథకంలో భాగంగా ఆటో డ్రైవర్లకు ఏడాదికి రూ.15 వేల సాయం ఎప్పుడు అందుతుందని వెయ్యి నేత్రాలతో ఎదురు చూస్తున్నారు. ఆటో డ్రైవర్లను నిర్లక్ష్యం చేస్తోంది. దీంతో ఆటోలపై ఆధారపడి జీవిస్తున్న వారి పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. సార్వత్రిక ఎన్నికల సమయంలో డీజిల్, పెట్రోల్ ధరలను తగ్గించడంతో పాటు ఏడాదికి ఒక్కొక్క ఆటో డ్రైవర్‌కు రూ.15 వేలు అందిస్తామని ఇచ్చిన హామీ నేటికి నేరవేరలేదు. అధికారం దక్కించుకున్నాక ఆ హామీల అమలుపై కనీసం ధ్యాస కూడా పెట్టని పరిస్థితి. కొత్త జీవోలతో ఆటో డ్రైవర్లుకు భారీ అపరాధ రుసుములు, కఠిన ఆంక్షలతో తమ బతుకుల్ని మరింత భారంగా మారుతున్నాయి.

పట్టణానికి ఆటోల్లో గ్రామీణులు

ఆటో డ్రైవర్లు ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల ప్రయాణికులను పట్టణ ప్రాంతాలకు నిత్యం వేలాది మంది ప్రయాణికులను తీసుకుని వస్తారు. అనకాపల్లి జిల్లా గ్రామీణ ప్రాంతాలకు ప్రధాన కేంద్రం కావడంతో ప్రతి పనికి గ్రామీణ ప్రజలు ఆటోలపై రాకపోకలు సాగిస్తారు. కొన్ని ప్రధాన రహదారులు మీదుగా ఆర్టీసీ బస్‌లు ప్రయాణం సాగిస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆర్టీసీ బస్సులు తిరగవు. అనకాపల్లి మండలంలో మామిడిపాలెం, గొలగాం, గోపాలపురం, కోడూరు, రేబాక, అక్కిరెడ్డిపాలెం, మారేడుపూడి, రాజుపాలెం, ఎరుకువానిపాలెం, రాజుపాలెం, వెంకుపాలెం, సీతానగరం, తగరంపూడి, జగన్నాథపురం, ఊడేరు, బవులవాడ కుంచంగి, కూండ్రం తదితర ప్రాంతాల ప్రయాణికులతో పాటు, బుచ్చెయ్యపేట, రావికమతం, చోడవరం, మండలాల నుంచి ప్రయాణికులు అనకాపల్లి పట్టణానికి నిత్యం ఆటోలపై రాకపోకలు సాగిస్తున్నారు. గ్రామీణ ప్రాంత ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంతో ప్రధాన పాత్ర ఆటో డ్రైవర్లు చూసుకుంటారు. రెక్కాడితే గాని డొక్కాడని జీవితాలతో అరకొర ఆదాయం మాత్రమే. రోజంతా ఆటో నడిపితే ఖర్చులన్నీ పోనూ మిగిలే దాంతో కుటుంబాన్ని నెట్టుకుస్తున్న వారికి భారం తప్పడం లేదు.

పెరిగిన ట్యాక్స్‌లు, జరిమానాలు..

కేంద్ర ప్రభుత్వం అపరాధ రుసుముల సవరణ పేరిట విడుదల చేసిన ఉత్తర్వులతో ఆటో డ్రైవర్లు బెంబేలెత్తుతున్నారు. దీని అమలు విచక్షణను రాష్ట్ర ప్రభుత్వాలకే అప్పగించినా, మన రాష్ట్రంలో ఆర్టీవో, పోలీస్ శాఖలకు ప్రత్యేక ఆదేశాల పేరిట తనిఖీలు ముమ్మరం చేశారు. భారీ జరిమానాలు విధిస్తున్నారు. ఆటో డ్రైవర్లు ఆక్షేపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుకు మందుకు రాని ప్రభుత్వం తమపై భారాలు వేయడంలో మాత్రమ వెనుకాడటం లేదు. కూటమి ప్రభుత్వం ఏర్పాటైన నుంచి ట్యాక్స్‌లు విపరీతంగా పెంచడమే కాకుండా డీజిల్, పెట్రోల్ ధరలూ ఆకాశాన్ని అంటుతున్నాయి. రవాణా శాఖ అధికారులు చీటికీమాటికీ రాంగ్ పార్కింగ్, సిగ్నిల్ జంపింగ్ పేరిట అధిక జరిమానాలు విధిస్తున్నారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆటోలను నమ్ముకుని జీవనం సాగించడం కష్టంగా ఉందని ఆటో డ్రైవర్లు కూటమి ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

డీజిల్, పెట్రోల్ ధరలు భగభగ...



కూడమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత పెట్రోల్, డీజిల్ ధరలు పెరిగిపోయాయి. రోజుకు ఆటో తిప్పితే అన్ని ఖర్చులు పోయి రూ.400 మిగలడం లేదు. 10 సంవత్సరాలుగా ఆటో డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తున్నాను. నెల వారి ఫైనాన్స్ కట్టాలంటే ఇబ్బందిగా ఉంటుంది. ఏటా ఇన్సూరెన్స్, ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు భారం అదనంగా పెరుగుతుంది. అపరాధ రుసుములు కూటమి ప్రభుత్వంలో పెరిగిపోయాయి. **–పటేల్, ఆటో డ్రైవర్, అనకాపల్లి**

ఏడాదికి రూ.15 వేలు ఎప్పుడు ఇస్తారు



గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఇచ్చిన హామీలను ఆటో డ్రైవర్లకు అమలు చేశారు. ఏటా రూ.10 వేలు ఆటో డ్రైవర్లకు నేరుగా బ్యాంకు ఖాతాలో జమ చేసేవారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి ఏడాదవుతున్న నేటికీ ఆటో డ్రైవర్లకు రూ.15లు ఇస్తామని చెప్పిన మాట నిలబెట్టుకోవడం లేదు. కుటుంబాన్ని నెట్టుకుని రావడం ఇబ్బందిగా ఉంది. ఆటో కార్మికులకు సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలి. **–హరి, ఆటో డ్రైవర్, అనకాపల్లి**

ప్రభుత్వమే ఆదుకోవాలి



కష్టాల్లో ఉన్న ఆటో కార్మికులను కూటమి ప్రభుత్వం ఆదుకోవాలి. సూపర్ సిక్స్‌లో ఇచ్చిన హామీ మేరకు ఏడాదవుతున్న రూ.15 వేలు సహాయం గురించి ప్రభుత్వం నోరు మెదపడంలేదు. రోజు రోజుకు నిత్యావసర ధరలు పెరుగుతున్నాయి. ఇటీవల కాలంలో ఆటోలపై ట్యాక్స్‌లు, జరిమానాలు పెరిగిపోయాయి. **–కోన లక్ష్మణ, ఆటో యూనియన్ నాయకుడు**

రేషన్ కార్డుల్లో చేర్పులు, మార్పులకు అవకాశం

కశింకోట: నూతన బియ్యం కార్డు పొందడం, దానిలో మార్పులు, చేర్పుల కోసం సంబంధిత సచివాలయాల్లో నమోదు చేసుకోవాలని ఎంపీడీవో వి.వి.రవికుమార్ గురువారం తెలిపారు. బియ్యం కార్డు పొందే వ్యక్తి తప్పనిసరిగా రాష్ట్రానికి చెందిన స్థానికుడై ఉండాలన్నారు. ప్రజా సాధికార సర్వేలో తప్పనిసరిగా నమోదై ఉండాలన్నారు. ఏ సచివాలయ పరిధిలో వారు అక్కడ నమోదు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. ఆధార్ వివరాలు కూడా సంబంధిత గ్రామానికి చెందినవై ఉండాలన్నారు. ఇప్పటి వరకు బియ్యం కార్డు లేని వ్యక్తి తమ తల్లిగాని, అత్త కార్డులో గాని లేని వారికి మాత్రమే కొత్త బియ్యం కార్డు ఇవ్వనున్నట్లు స్పష్టం చేశారు. పిల్లలను బియ్యం కార్డులో చేర్పించడానికి వారి జన్మదిన ధ్రువీకరణ పత్రం, పెళ్లి అయిన వధువును చేర్చడానికి వారి వివాహ ధ్రువపత్రంగాని, ఆధార్ కార్డులో ఆమె భర్త పేరు ఉన్నచో దాన్ని పరిగణనలోకి తీసుకుంటారన్నారు. బియ్యం కార్డును విభజించడానికి వారు ప్రజా సాధికార సర్వేలో వేరుగా ఉండాల్సి ఉంటుందన్నారు. లేనిచో విభజన సాధ్యం కాదన్నారు. బియ్యం కార్డులో మృతి చెందిన వ్యక్తిని మాత్రమే తొలగిస్తారన్నారు. తప్పుగా ఉన్న ఆధార్ కార్డును వదిలేసి కొత్త ఆధార్‌తో ముందుగా ప్రజా సాధికార సర్వేలో నమోదైన తర్వాత మాత్రమే ఆధార్ సీడ్ చేయడం జరుగుతుందని, దీన్ని గమనించాలన్నారు. ఆధార్ చిరునామా కచ్చితంగా సంబంధిత సచివాలయ చిరునామా ఉండాలన్నారు. కుటుంబ పెద్ద వేలిముద్రతో మాత్రమే చిరునామా మార్పు చేస్తారన్నారు. బియ్యం కార్డు వద్దు అనుకున్న వారు తమ కార్డును అప్పగించాలన్నారు.

వైభవంగా చౌడేశ్వరి కల్యాణోత్సవం



చౌడేశ్వరి సమేత సాంబమూర్తి కల్యాణోత్సవం

కశింకోట: మండలంలోని బంగారయ్యపేటలో చౌడేశ్వరి సమేత సాంబమూర్తి ఆలయంలో అమ్మవారు కల్యాణోత్సవం గురువారం వైభవంగా జరిగింది. శాస్త్రోక్తంగా వేద మంత్రాల నడుమ ఉత్సవమూర్తులను అందంగా అలంకరించి కల్యాణాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. స్థానిక నాయకులు, ప్రజలు ఎక్కువ సంఖ్యలో దర్శించుకుని పూజలు చేశారు. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిగాయి.

విజ్ఞాన వికాసానికి వేసవి శిక్షణ



గణితం బోధిస్తున్న ఉపాధ్యాయుడు అప్పారావు

అనకాపల్లి టౌన్: వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మండలంలోని తుమ్మపాల శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు స్టోరీ టెల్లింగ్, గణితం తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా జెడ్పీ హైస్కూల్ ఉపాధ్యాయుడు అప్పారావు మాట్లాడుతూ విద్యార్థుల విజ్ఞాన వికాసానికి వేసవి శిక్షణ తరగతులు దోహదపడతాయన్నారు. వేసవి సెలవుల్లో ఇటువంటి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమలంలో గ్రంథాలయ అధికారి కె శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

పారా లీగల్ వలంటీర్లకు దరఖాస్తులు ఆహ్వానం

అనకాపల్లి టౌన్: జిల్లాలో పారా లీగల్ వలంటీర్లు (న్యాయ సహాయకులు)గా పనిచేయుటకు ఆసక్తి గల అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల న్యాయ సేవాధికార సంఘం అధ్యక్షుడు వి. నరేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు చిన్నంశెట్టి రాజు ఉత్తర్వులు మేరకు, ప్రజలకు న్యాయపరమైన సలహాలతోపాటు, తగిన న్యాయ సహాయం చేయాలని ఆలోచన ఉన్న ఔత్సాహికులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు దరఖాస్తుతోపాటు ఒక స్టాంప్ సైజ్ ఫొటో, సంబంధిత పత్రాలు పట్టణ కోర్టులో అందజేయాలన్నారు. ఇందుకు కనీస విద్యార్హత పదో తరగతి అని, వివిధ సేవా సంస్థల్లో పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులకు ఎటువంటి జీతం గానీ పారితోషికం గానీ ఉండదని తెలిపారు. వీరికి శిక్షణ అనంతరం 50 మందిని పారా లీగల్ వలంటీర్లగా ఏడాది కాలానికి నియమిస్తామని తెలిపారు.

సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని డిమాండ్



మాట్లాడుతున్న రామునాయుడు

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు జిల్లాలో మూతపడ్డ సుగర్ ఫ్యాక్టరీలను తెరిపించాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీపీఐ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుని తీరుతామన్నారు. అటవీ, బంజర భూములు, ప్రభుత్వ భూములలో సాగు చేస్తున్న గిరిజనులకు పట్టాలు ఇప్పించే విధంగా ఉద్యమాలు చేస్తామన్నారు. ఎన్నికల హామీలను అమలు చేసే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చే కార్యక్రమాలకు రూపకల్పన చేశామన్నారు. జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు మాట్లాడుతూ పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతున్న జిల్లాలో కాలుష్య రహిత పరిశ్రమలకు ప్రాధాన్యం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జి. గురుబాబు, వియ్యపు రాజు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని వినతి



ఆర్టీసీ డిపో మేనేజర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

అనకాపల్లి టౌన్: కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు మూతా కార్మికులకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని సీఐటీయూ జిల్లా గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ కోరారు. ముఠా కార్మికులకు సంబంధించి పలు సమస్యలతో కూడిన వినతి ప్రతాన్ని ఆర్టీసీ డిపో మేనేజర్‌కు విజయ్ కుమార్‌కు సీపీఎం ఆధ్వర్యంలో గురువారం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న హమాలీలకు కూలిరేట్లు పెంచాలని కోరుతూ ఈ నెల 20న సమ్మె చేపడుతున్నట్లు తెలిపారు. అసంఘటిత రంగ కార్మికులకు సాంఘిక భద్రతా చట్టం 2008 అమలుకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో జె. కనకరమణ, కొండారావు, అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

దేశ వ్యాప్త కార్మిక సమ్మె విజయవంతానికి పిలుపు



సమావేశంలో ప్రసంగిస్తున్న కోటేశ్వరరావు

పరవాడ: కార్మిక సమస్యలపై ఈ నెల 20న నిర్వహించే దేశవ్యాప్త కార్మిక సమ్మెను విజయవంతం చేయాలని సిటు రాష్ట్ర కార్యదర్శి జి.కోటేశ్వరరావు కోరారు. లంకెలపాలెం కూడలిలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లేబర్ కోడ్‌లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనాల చట్టం అమలు చేయాలని, కార్మిక పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక చట్టాలను యాజమాన్యాలకు అనుకూలంగా మార్పులు చేసే చర్యలను విరమించుకోవాలన్నారు. బీజేపీ ప్రభుత్వం దొంగచాటుగా కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను నాలుగు లేబర్‌కోడ్‌లుగా మార్చి, వాటిని అమలు చేసే ప్రయత్నాలను ముమ్మరం చేసిందన్నారు. దీనిని నిరసిస్తూ ఈ నెల 20న దేశవ్యాప్త సమ్మెకు పిలుపునివ్వడం జరిగిందని కోటేశ్వరరావు అన్నారు. ఈ కార్యక్రమంలో సిటు జిల్లా ఉపాధ్యక్షుడు గనిశెట్టి సత్యనారాయణ, మోటారు ట్రాన్స్‌పోర్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు బొడ్డపు శ్రీనివాసరావు, ముఠా యూనియన్ నాయకుడు దాసరి దేముడు, శ్రీను పాల్గొన్నారు.

నర్సరీని పరిశీలించిన కన్జర్వేటర్



నర్సరీని పరిశీలిస్తున్న కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ దివాస్ మైదీస్

నర్సీపట్నం: నర్సీపట్నం అటవీ కలప డిపోలో ఉన్న సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో పెంచుతున్న నర్సరీని విశాఖ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ దివాస్ మైదీస్ గురువారం సందర్శించారు. సాధారణ తనిఖీల్లో భాగంగా డీఎఫ్‌వో కార్యాలయాన్ని సందర్శించారు. అటవీ కార్యకలాపాలపై ఆరా తీశారు. అనంతరం అక్కడకు సమీపంలో ఉన్న నర్సరీని పరిశీలించారు. నర్సరీలో పెంచుతున్న పండ్ల జాతి మొక్కలు, పూలు, వివిధ రకాల వృక్షజాతుల గురించి సోషల్ ఫారెస్ట్ డీఎఫ్‌వో లక్ష్మణ్ కన్జర్వేటర్‌కు వివరించారు. ఆయన వెంట డీఎఫ్‌వో ఎం.శామ్యూల్, రేంజర్ లక్ష్మీనర్సు, తదితరులు ఉన్నారు.

ఘనంగా కనకదుర్గ ఆలయ వార్షికోత్సవం



వేల్పులవీధి కనకదుర్గమ్మను దర్శించుకున్న మలసాల భరత్‌కుమార్



అన్నసమారాధన ప్రారంభిస్తున్న భరత్‌కుమార్, మందపాటి జానకీరామరాజు

అనకాపల్లి: ప్రశాంతమైన వాతావరణంలో గ్రామ దేవత ఉత్సవాలు నిర్వహించాలని, ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ కోరారు. స్థానిక వేల్పులవీధి రజకుల కాలనీలో కనకదుర్గ ఆలయ పదో వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని గురువారం ఆయన దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం భారీ అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఆలయ వార్షికోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, 83, 84వ వార్డు ఇన్‌చార్జులు జాజుల రమేష్, కోరుకొండ రాఘవ, పార్టీ నాయకులు మున్నూరు శ్రీనివాసరావు, మలసాల కుమార్, బొండ శంకరరావు, ఆలయ అధ్యక్షుడు చిందాన హనుమంతరావు, సభ్యులు కింతాడ శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించిన డీపీవో



సంపద తయారీ కేంద్రంలో జిల్లా పంచాయతీ అధికారి శిరీషారాణి

పరవాడ: గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల ఇళ్ల నుంచి తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తరలించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని అనకాపల్లి జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) ఆర్.శిరీషారాణి ఆదేశించారు. వెన్నలపాలెంలోని సంపద తయారీ కేంద్రాన్ని ఆమె గురువారం పరిశీలించారు. ప్రతి శనివారం గృహ వాసుల నుంచి తడి, పొడి చెత్తలను సేకరించి సంపద తయారీ కేంద్రాలకు తప్పనిసరిగా చేర్చాలని పంచాయతీ కార్యదర్శిని ఆదేశించారు. డీపీవో వెంట పరవాడ ఎంపీడీవో వి.ధర్మారావు, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఫణీంద్ర కుమార్

నర్సీపట్నం: సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడిగా జి.ఫణీంద్ర కుమార్ ఎన్నికయ్యారు. ఇప్పటికే ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శిగా, రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా బాధ్యతలు నిర్వహించారు. జిల్లా కార్యవర్గ సభ్యుడిగా ఎన్నుకున్నందుకు పార్టీ నాయకత్వానికి ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

అప్పన్నకు విశేషంగా ఏకాదశి ఆర్జిత సేవలు



స్వర్ణతులసీదళాలతో ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు, భక్తులు

సింహాచలం: ఏకాదశిని పురస్కరించుకుని శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 7 నుంచి స్వర్ణతులసీ దళార్చన ఘనంగా నిర్వహించారు. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం జరిపారు. 108 స్వర్ణ తులసీదళాలతో అష్టోత్తర శతనామావళి పూజ నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.



నిత్యకల్యాణంలో పాల్గొన్న ఉభయదాతలు

వైభవంగా నిత్యకల్యాణం

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గురువారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులను వేంజేపచేసి ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ప్రభుత్వ భూమిలో హెచ్చరిక బోర్డు ఏర్పాటు



బోర్డు ఏర్పాటు చేస్తున్న వీఆర్వో చిరంజీవి, సిబ్బంది

మాకవరపాలెం: ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. మండలంలోని లచ్చన్నపాలెం శివారు దాలింపేటలోని సర్వే నంబర్ 46లో ఉన్న ప్రభుత్వ భూమిని ఆక్రమించి లేఅవుట్ వేసినట్టు ఫిర్యాదు అందిందని వీఆర్వో చిరంజీవి తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఈ భూమిని పరిశీలించి, ఇది ప్రభుత్వ భూమి అని, ఆక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.

అనకాపల్లిలో నేడు ఏపీటీఎఫ్ ధర్నా

కె.కోటపాడు: పాఠశాల వ్యవస్థలో ప్రభుత్వం అవలంబిస్తున్న అసంబద్ధ విధానాలకు వ్యతిరేకంగా శుక్రవారం జిల్లా కేంద్రం అనకాపల్లిలో ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించనున్నట్టు ఫెడరేషన్ మండల శాఖ అధ్యక్షుడు సూర్రెడ్డి శ్రీనివాసరావు తెలిపారు.